క్లుప్తంగా

నేడు కౌన్సిల్ బడ్జెట్, సాధారణ సమావేశాలు

సామర్లకోట: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో 2024-25 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్, సాధారణ కౌన్సిల్ సమావేశాలు జరుగుతాయని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు తెలిపారు. ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన బడ్జెట్ సమావేశం ఉంటుందని, తదుపరి సాధారణ సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశాలకు అధికార, ప్రతిపక్ష సభ్యులు, ఆయా శాఖల అధికారులు తప్పని సరిగా హాజరుకావాలన్నారు.

పిఠాపురంలో..

పిఠాపురం: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశపు హాలులో బుధవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ బడ్జెట్ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశంలో నూతన బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నట్లు ఆమె తెలిపారు. కౌన్సిల్ సభ్యులందరూ హాజరు కావాలని ఆమె కోరారు.

విధులకు హాజరైన అంగన్‌వాడీలు



గొల్లప్రోలులో బాధ్యతలు తీసుకుంటున్న అంగన్‌వాడీ వర్కర్

పిఠాపురం: సమ్మె విరమించడంతో మంగళవారం అంగన్‌వాడీ వర్కర్లు విధులకు హాజరయ్యారు. ఇప్పటి వరకూ అంగన్‌వాడీ వర్కర్లు సమ్మెలో ఉండడంతో ప్రత్యామ్నాయంగా మహిళా పోలీసుల ఇతర సిబ్బందితో అంగన్‌వాడీ సెంటర్లను ప్రభుత్వం నిర్వహించింది. దీంతో మంగళవారం తిరిగి విధులకు హాజరైన అంగన్‌వాడీ వర్కర్లకు మహిళా పోలీసులు బాధ్యతలు అప్పగించారు.

ఎన్‌ఎంఎంఎస్‌లో చదలాడ విద్యార్థి ప్రతిభ

పెద్దాపురం: జాతీయ స్థాయి ఎన్‌ఎంఎంఎస్ పరీక్షల్లో చదలాడ హైస్కూల్‌కు చెందిన అభ్యసన స్టడీ సర్కిల్ విద్యార్థి వేమన రామ నాగేశ్వరరావు ఉత్తమ ప్రతిభ కనపర్చాడు. 9వ తరగతి ప్రవేశానికి నిర్వహించే ఎన్‌ఎంఎంఎస్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన అతడిని స్టడీ సర్కిల్ నిర్వాహకులు కమ్మిల బుజ్జిబాబును గ్రామస్థులు, పలువురు ప్రజా ప్రతినిధులు అభినందించారు.

రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరుడు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడలో వేంచేసియున్న రామలింగేశ్వరునికి మంగళవారం ఆరుద్రా నక్షత్రం సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాలతో అభిషేకించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేయగా పలువురు భక్తులు దర్శించుకున్నారు.

నేతాజీకి నివాళి

సామర్లకోట: నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతిని సామర్లకోట మండలం పీబీ దేవం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ నీలపాల సత్యనారాయణ ఆధ్వర్యంలో నేతాజీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన ధైర్య సాహసాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సభ్యుడు టేకుమూరి వెంకన్న తదితరులు పాల్గొని నివాళ్లు అర్పించారు.

ఈఈపై కేసు నమోదు చేయాలి

కిర్లంపూడి: కులం పేరుతో దూషించిన పెద్దాపురం ఆర్అండ్‌బీ ఈఈ వెంకటేశ్వరరావుపై అట్రాసిటి కేసు నమోదు చేయాలంటూ రాజుపాలెం నుంచి సామర్లకోట వెళ్లే ప్రధాన రహదారిపై దళిత సంఘాలు మంగళవారం ధర్నా నిర్వహించారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. సుమారు గంట సేపు వాహనాలు నిలిచిపోయాయి. దీనిపై ఆందోళనకారులు మాట్లాడుతూ ఈఈ వెంకటేశ్వరరావు రోడ్డు వివాదంలో మమ్ములను కులం పేరుతో దూషించడమే కాకుండా మాపై కేసు పెట్టారన్నారు. అప్పట్లో ఈఈపై తామ ఫిర్యాదు చేసినా పోలీసులు స్వీకరించలేదన్నారు. అతనిపై పోలీసులు కేసు నమోదు చేసే వరకు ధర్నా విరమించేది లేదని తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన అధికారులు

కాకినాడ సిటీ: సాధారణ బదిలీల్లో భాగంగా ఏలూరు కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న కె.చల్లన్‌దొర కాకినాడ అర్బన్ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లాను, జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ, డీఆర్వో కె శ్రీరమణిని ఆయన కలిశారు. అలాగే ప్రస్తుతం ఏపీఈడబ్ల్యూడీసీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పని చేస్తున్న కె.వెంకటరాజు అదనపు బాధ్యతలతో కాకినాడ జిల్లా సమగ్ర శిక్ష ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లాను మంగళవారం కలిసారు.

గృహయోగం

- సొంతింటి కల సాకారం
- పిఠాపురం నియోజకవర్గంలో మంజూరైన 7930 ఇళ్లు
- ఇప్పటివరకూ పూర్తయినవి 3757

కొత్తపల్లి: పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషి సల్ఫలితాలను ఇస్తోంది. ఇంటి నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం సాయం అందిస్తోంది. అంతేకాకుండా స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు కూడా అదనంగా రుణాలు ఇచ్చి ఆర్థిక చేయూతనిస్తోంది. దీంతో అనుకున్న స్థాయిలో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం వేగంగా సాగుతోంది.

మౌలిక వసతులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా పిఠాపురం నియోజకవర్గంలో మొదటి విడతగా 7930 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటి వరకూ 3787 గృహాల నిర్మాణాన్ని పూర్తి చేశారు. మిగిలినవి నిర్మాణ దశలో ఉన్నాయి. వీటి నిర్మాణాల్లో వేగం పెంచేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. ప్రభుత్వం లబ్ధిదారుడికి ఇంటి నిర్మాణాన్ని బట్టి మూడు దశల్లో రూ.1.80లక్షలు ఇస్తోంది. ఇళ్ల నిర్మాణ సామగ్రి సిమెంట్ 100 బస్తాలు, ఇసుక 20 టున్నులు, స్టీలు 485 కేజీలు లబ్ధిదారుల చెంతకే సరఫరా చేయడంతో పాటు ఆయా కాలనీల్లో అవసరం అయిన మౌలిక వసతుల (అంతర్గత రోడ్లు, నీటి, విద్యుత్)ను కల్పిస్తోంది. ముఖ్యంగా ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న రూ. 1.80 లక్షలకు తోడుగా ఇళ్ల నిర్మాణం చేపట్టిన స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు అదనంగా ఒక్కొక్కరికీ రూ.35వేల రుణాలను అందిస్తోంది. ఇంటి నిర్మాణం చేపట్టిన మహిళలకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. మహిళలు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో సొంత ఇళ్లను నిర్మించుకునేందుకు ఉత్సాహాన్ని చూపుతున్నారు.

ఇది నమ్మలేని నిజం



నా జీవితంలో ఏ నాడు కూడా సొంత ఇల్లు నిర్మించుకుంటానని అనుకోలేదు. మా అన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి చేపట్టడం వల్ల నా కల నెరవేరింది. మాకుటుంబ సభ్యులందరితో సొంత ఇంటిలో ఉంటున్నామనే ఆనందం కలిగింది. మళ్లీ మా అన్న అధికారంలోకి రావాలి.

– సిరిపిన అన్నపూర్ణ, పొన్నాడ

నా కల నెరవేరింది



నిర్మించుకున్న సొంతింటి వద్ద సత్య



సొంత ఇల్లు నిర్మించుకోవాలనే నా కల సాకారమైంది. మా జగనన్న ఇచ్చిన మాట ప్రకారం ఇళ్ల స్థలం ఇవ్వడమే కాకుండా నిర్మించుకునేందుకు కూడా రుణాలను మంజూరు చేశారు. మా కుటుంబం బతికున్నంత కాలం జగనన్నను మరువలేం. ఆయన సీఎం కావడం వల్లే మాకు అదృష్టం వచ్చింది. నాలాంటి నిరుపేద మహిళల కల నెరవేరింది.

– బెండ సత్య పొన్నాడ



పొన్నాడ లేఅవుట్‌లో నిర్మిస్తున్న ఇళ్లు

మొదటి విడతలో మంజూరైన ఇళ్లు

మండలం	మంజూరైనవి	పూర్తైనవి
కొత్తపల్లి	2403	935
గొల్లప్రోలు రూరల్	2329	899
అర్బన్	2061	481
పిఠాపురం రూరల్	1419	874
అర్బన్	486	456

మహిళల్లో ఉత్సాహం



వైఎస్సార్ జగనన్న కాలనీల్లో సొంతంగా ఇళ్లను నిర్మించుకునేందుకు మహిళలు ఉత్సాహాన్ని చూపుతున్నారు. గృహాలు నిర్మించుకుంటున్న స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఒక్కొక్కరికీ రూ.35వేలు అందిస్తున్నాం. గృహాలు నిర్మించుకోవాలని లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నాం. ముఖ్యంగా మండలంలో సుమారుగా 700 ఇళ్లు పూర్తి కాగా 44 శ్లాబ్, 85 గోడ దశలో ఉన్నాయి. మిగిలిన వాటిని కూడా వివిధ దశలో ఉన్నాయి. వాటిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం. కొమరగిరి పంచాయతీలో కాకినాడ అర్బన్‌కు సంబంధించి సుమారు 16వేల మందికి పైగా ఇళ్ల పట్టాలు ఇచ్చారు. ఆ లేఅవుట్‌లో కూడా ఇళ్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

– కేబీఎస్ రాజు, గృహ నిర్మాణశాఖ ఏఈ కొత్తపల్లి మండలం

లవకుశలో నటించడం పూర్వజన్మ సుకృతం

కుశుడు పాత్రధారి నాగ సుబ్రహ్మణ్యం



నాగ సుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న స్నేహితులు

పెద్దాపురం: లవకుశ సినిమాలో నటించడం నా పూర్వ జన్మ సుకృతమని కుశుడు పాత్రధారి వియ్యారి నాగ సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలో ప్రముఖ న్యాయవాది సీహెచ్ కనకదుర్గారావు ఇంటికి వచ్చిన ఆయన మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. లవకుశ సినిమాలో నటించిన వారందరూ గతించినా తాను మాత్రమే జీవించి ఉన్నానన్నారు. ఆ సినిమా తరువాత సీతారామ కళ్యాణం. వెలుగునీడలు, శ్రీ వెంకటేశ్వర మహత్యం సినిమాల్లో నటించానన్నారు. బతుకుతెరువు కోసం బుర్ర కథలు ప్రారంభించి సుమారు పదివేల ప్రదర్శనలు ఇచ్చి నాజర్ తరువాత ద్వితీయ రికార్డును సాధించానన్నారు. అనంతరం ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది దుర్గారావుతో పాటు పుట్టా సోమన్నచౌదరి, హరి గోపాలశర్మ, శ్రీనివాసరావు తదితరులున్నారు.

ఎన్నికల సమరానికి సిద్ధం కావాలి

నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో దొరబాబు



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: ఎన్నికల సమరానికి ప్రతి కార్యకర్త సిద్ధం కావాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను, గత టీడీపీ ప్రభుత్వంలో ప్రజా వ్యతిరేక పాలనను ప్రజలకు వివరించాలన్నారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్లతో ప్రజలకు జరుగుతున్న మేలును తెలియజేయాలన్నారు. ఓటు హక్కు లేని చిన్నారులకు ఇస్తున్న అమ్మఒడి పథకం, అమలు తీరును, నవరత్న పథకాల అమలును వివరించాలని పేర్కొన్నారు. ఎన్నికల్లో కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని ఆయన అన్నారు. అధికారం కోసం చంద్రబాబు ఆ పార్టీని స్థాపించిన ఎన్టీఆర్‌నే వెన్నుపోటు పొడిచారని గుర్తుచేశారు. ప్రస్తుత ఎన్నికల్లో పవన్ కల్యాణ్‌ను పావులా వాడుకునే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని అన్నారు. నియోజకవర్గంలో భారీ మెజార్టీతో విజయం సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. బుధవారం సామర్లకోటలో జరిగే కౌన్సిల్ సాధారణ సమావేశంలో తన తండ్రి సుబ్బారావు కో ఆప్షన్ సభ్యత్వ రాజీనామాను ఏకగ్రీవంగా ఆమోదించాలని సూచించారు. పార్టీ బలోపేతం కోసం టీడీపీ నుంచి వచ్చిన సీనియర్ సభ్యుడు మన్యం చంద్రరావుకు ఆ పదవి ఇస్తున్నట్లు దొరబాబు తెలిపారు. ఎంపీపీలు బొబ్బరాడ సత్తిబాబు, పెంకే సత్యవతి, జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, మున్సిపల్ చైర్ పర్సన్లు గంగిరెడ్డి అరుణ, బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, గోకిన సునేత్రదేవి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు ఆవాల లక్ష్మీనారాయణ, కంటే వీర్రాఘవరావు, జిల్లా కార్యదర్శి తలారి దొరబాబు, మండల పార్టీ అధ్యక్షులు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేసిన దవులూరి దొరబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ తదితరులు

సామర్లకోట: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడానికి ఎంత ఖర్చయినా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెనుకాడడం లేదని నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయం వద్ద పలువురికి ఆయన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ప్రజారోగ్య సమస్యల పరిష్కారానికి ప్రతి సచివాలయ పరిధిలో ఒక ఏఎన్‌ఎంను నియమించి వారి పరిధిలోని ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితినీ వాకబు చేస్తున్నారని, ఆరోగ్యశ్రీ కార్డులు అందుబాటులో లేని వారు సహాయానికి దరఖాస్తులు చేసుకున్న వెంటనే నిధులు విడుదల చేస్తున్నారని ఆయన అన్నారు. ఈ మేరకు సామర్లకోటకు చెందిన చిమ్మా శ్రీనివాసు కుటుంబ సభ్యులకు రూ.60 వేలు, మట్లపల్లి రమేష్‌బాబు కుటుంబ సభ్యులకు రూ.2.5 లక్షలు, చంద్రపాలేనికి చెందిన డేగల శ్రీను కుటుంబ సభ్యులకు రూ.68,500, హుస్సేన్‌పురానికి చెందిన పుప్పాల శ్రీను కుటుంబ సభ్యులకు రూ.1.90 లక్షలు, పెద్దాపురానికి చెందిన కుప్పెల పుష్పసాయి అంబికా కుటుంబ సభ్యులకు రూ.రెండు లక్షల విలువైన చెక్కులు అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్లు గంగిరెడ్డి అరుణ, బొడ్డు తులసీ మంగతాయారు, వైస్‌చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, పట్టణ సచివాలయ కన్వీనర్ ఇరుసుమళ్ల సాయి, సొసైటీ అధ్యక్షుడు మేకా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు మద్దాలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇంత నిర్లక్ష్యమా..



గోర్సలో రోడ్డుపై నిలిచిన మురుగునీరు

కొత్తపల్లి: గోర్స గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. దీనిపై అధికారులకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో ప్రధాన రహదారులు, అలయాలు వద్ద, డ్రైన్లు చెత్తతో పూడుకుపోయాయి. మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దుర్వాసన వెదజల్లడంతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామాల్లో పారిశుధ్యమంటే ఇంత నిర్లక్ష్యమా అంటూ ప్రజలు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. బయటకు రావాలంటే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్య మెరుగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కేంద్రీయ విద్యాలయలో చిత్రలేఖన పోటీ



కేంద్రీయ విద్యాలయలో చిత్రాలను గీస్తున్న విద్యార్థులు

కాకినాడ రూరల్: మండలంలోని వలసపాకల గ్రామంలోని కేంద్రీయ విద్యాలయలో పరీక్షా పే చర్చ కార్యక్రమంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు పెయింటింగ్ పోటీ నిర్వహించారు. కాకినాడ, పరిసర గ్రామాలకు చెందిన సుమారు వంద మంది పోటీలో పాల్గొన్నారు. పరీక్షలపై భయం పోగొట్టడానికి ప్రధాని నరేంద్ర మోదీ సూచించిన కొన్ని విషయాలు అనుసరించి విద్యార్థులు చిత్రాలు గీయగా న్యాయ నిర్ణేతలు ఐదింటిని ఎంపిక చేశారు. పోటీలలో పెద్దాపురం నవోదయ విద్యాలయ, ఆశ్రమ పబ్లిక్ స్కూల్, అక్షర పబ్లిక్ స్కూల్, లక్ష్య స్కూల్, శరణ్య కాన్సెప్ట్ స్కూల్, శ్రీ చైతన్య టెక్నో స్కూల్, లిటిల్ వుడ్ స్కూల్ నుంచి విద్యార్థులు హాజరు కాగా పాల్గొన్నవారికి ప్రమాణ పత్రాలతో పాటు పీఎం నరేంద్రమోదీ రచించిన ఎగ్జామ్ వారియర్స్ పుస్తకాన్ని అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాధామాధవి, సంజయ్ వ్యవహరించగా కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ శేఖర్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామాలయాల్లో ధాన్యపు కుచ్చులు



కుమ్మరిలోవ రామాలయంలో వరి కుచ్చులు కడుతున్న దాలినాయుడు

తుని రూరల్: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ, రానున్న వేసవిలో పిచ్చుకల ఆహార కొరత నివారించేందుకు రామాలయాల్లో వరి కుచ్చులు ఏర్పాటు చేస్తున్నట్లు హరిత వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు దాలినాయుడు మాస్టర్ (పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు) మంగళవారం తెలిపారు. మొదటి రోజు తుని పట్టణంలో అన్ని రామాలయాల్లో వరి కుచ్చులను వేలాడదీసినట్టు ఆయన తెలిపారు. తుని మండలంలో ముగిసిన తర్వాత కోటనందూరు, తొండంగి, రౌతులపూడి, శంఖవరం మండలాల్లోని గ్రామాల్లో కుచ్చులు కడతామన్నారు. మెట్ట ప్రాంతంలో ఖరీఫ్ తర్వాత రబీ పంటలు కొంత మేరకే వేస్తారని, ఆ సమయంలో పక్షులకు ప్రధానంగా పిచ్చుకలకు ఆహారం కొరత ఏర్పడుతుందన్నారు. ఈ కుచ్చులు కట్టడం వల్ల కొంతమేరకు పిచ్చుకలకు ఆహారం అందుతుందన్నారు. వేసవిలో నీటి కొరత తీర్చేందుకు ప్రతి ఇంటి బయట పక్షులకు అనువుగా తాగు నీరు ఏర్పాటు చేయాలని తాము పర్యటించే గ్రామీణులను చైతన్యపర్చుతున్నామన్నారు. ఖరీఫ్‌లో సేకరించిన ధాన్యపు కంకులతో కుచ్చులు తయారు చేశామన్నారు. ఐదు మండలాల్లో 120 నుంచి 150 వరకు ఆలయాల్లో కుంచెలు కట్టే ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆయన వివరించారు.

పంట కాలువలను పూడ్చేస్తున్నారు





వాకతిప్పలో పంటకాలువను గ్రావెల్‌తో పూడ్చేసిన దృశ్యం, లేఅవుట్‌గా మార్చేసిన పొలాలు

కొత్తపల్లి: వాకతిప్పలో విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో పంట కాలువలను లే అవుట్ పేరుతో పూడ్చేశారు. పంటలకు సాగునీరు అందించే ప్రధాన కాలువలలో చిన్న చిన్న తూరలు వేసి గ్రావెల్‌తో పూడ్చేస్తున్నారు. దీంతో సాగు నీరందడంలేదని రైతులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఇప్పటికైనా సబంధింత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గ్రామ రెవెన్యూ అధికారి చంద్రశేఖర్‌ను వివరణ పంట కాలువను పూడ్చివేయడం నేరమని సదరు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టి తీసుకువెళతామన్నారు.

స్వాతంత్ర్యయోధుని జయంతిని మరిచారు



సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి కనీసం పూలమాల వేయని దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడ పాతమార్కెట్ సెంటర్‌లో ఉన్న స్వాతంత్ర్యయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి మంగళవారం కనీసం పూలదండ కూడా వేయలేదు. విగ్రహానికి పట్టిన బూజును కూడా ఎవరూ శుభ్రపరచకపోవడం కలచివేసింది. స్వాతంత్ర్యం కోసం ఆజాద్ హిందూఫౌస్ సైన్యాన్ని స్థాపించి, పోరాడిన మహనీయుడిని నేటి తరం మరిచిపోవడం బాధాకరమన్నారు. కనీసం జయంతి రోజైనా ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించకపోవడంపై పోరాట వీరులపై ఎంత గౌరవం ఉందో అర్థమవుతోంది.

ఉమర్ ఆలీషా బోధనలు మతాతీతం

జేఎన్‌టీయూకే వీసీ ప్రసాదరాజు



వీసీ ప్రసాదరాజును సత్కరిస్తున్న అహ్మద్ ఆలీషా, జమ్మలమడక నాగమణి తదితరులు

కాకినాడ రూరల్: మతాతీతమైన విద్య, విజ్ఞానాన్ని బోధించిన మహనీయుడు కవిశేఖర డాక్టర్ ఉమర్ ఆలీషా అని జేఎన్‌టీయూకే వీసీ ప్రసాదరాజు పేర్కొన్నారు. బోట్‌క్లబ్ వద్ద మంగళవారం ఉదయం కవిశేఖర ఉమర్ ఆలీషా 79వ వర్థంతి కార్యక్రమంలో ప్రసాదరాజు, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి, భవర్‌లాల్, కవి శిరీష, హుస్సేన్ షా తదితరులు అతిథులుగా హాజరయ్యారు. పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా సోదరుడు అహ్మద్ ఆలీషా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలుత కవిశేఖర ఉమర్ ఆలీషా విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అహ్మద్ ఆలీషా మాట్లాడుతూ కవిశేఖర డాక్టరు ఉమర్ ఆలీషా బహుముఖ ప్రజ్ఞాశాలి అన్నారు. మహాపండితుడిగా, బహు గ్రంథకర్తగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా, శాసన సభ్యుడిగా, మేధావిగా పేరొంది సేవలందించారన్నారు. పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, ఏవీవీ సత్యనారాయణ, సలాది రమేష్, మండా ఎల్లమాంబ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు, ప్రసాద వితరణ చేసి, అతిథులను సత్కరించారు.

తురగాకు శివ పార్వతి అవార్డు



తురగా సూర్యారావును సత్కరిస్తున్న నిర్వాహకులు

బాలాజీచెరువు: కాకినాడకు చెందిన విశ్రాంత పోస్టుమాస్టర్ తురగా సూర్యారావును 'శివ పార్వతి అవార్డ్స్–2024' వరించింది. హైదరాబాద్‌కు చెందిన సూర్య చంద్ర కల్చరల్ ఆర్గనైజేషన్ నిర్వహించిన 'శివ పార్వతి అవార్డ్స్–2024' అధ్యక్షుడు మోహన్ చంద్ర ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో నిర్వహించారు. డాక్టర్ చిల్లా రాజశేఖరరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చిన్నారులు నిర్వహించిన కుచిపూడి, భారత నాట్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథులుగా జస్టిస్ బూర్గుల మధుసూదన్, అతిథిగా డాక్టర్ తురగా సూర్యారావు, భాగ్యలక్ష్మి రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, చందు, అంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూర్యారావును దుశ్శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. పోస్ట్ మాస్టర్ టి.అమ్మిరాజు, పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, కె.ప్రసాదరావు పి.సాగర్, సంపర శ్రీనివాసరావు, అనిత, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు టి.గాలీబు తదితరులు తురగాను అభినందించారు.

GENERAL PUBLICATION

Under instructions from our client, Shriram Finance Ltd., registered office at Chennai and branch office at Samalkota, we issue this notice to the general public. Our client is intending to advance loan to Sri.Boksu Lovaraju, S/O Late Babu Rao, who agreed to create equitable mortgage relating to the under mentioned schedule properties belongs to him.

The public is hereby informed that if anybody has got any objection in respect of the mortgage of the schedule property, kindly contact under mentioned address within one week. Otherwise, the same is treated as no objection.

:Schedule:

Previously East Godavari District, Presently Kakinada District, Peddapuram Sub-registry, Peddapuram Mandal, Peddapuram Municipality, ward no:7, S.No:189/3 to an extent of Ac.3.15 1/2 cents on northern side out of full extent of Ac.6.31cents sub-divided as R.S.No:189/3B to an extent of Ac.2.00cents sub-divided as R.S.No:189/3B1 to an extent of Ac.0.30cents on eastern side out of Ac.2.00cents divided into house sites, plot no:3, vacant site to an extent of 146.66sq yards within the following boundaries with all usufruct, water, ways and all easementary rights.

East : 22 feet 22feet width road; **West:** 22 feet land of Gadamsetty Srinu; **South** : 60 feet site sold to Jakkani Leelavathi ; **North:** 50 feet site sold to Yaramati Prasad.

G.S.M.N.SWAMY, B.COM.B.L. **G.A.S.S. JYOTHI,** B.L.
ADVOCATES, D.No:8-24-6, BF:1, KAKINADA-4. Ph:9866191387.